

కథా కౌముది

# రంగుటద్దాలు

బుద్ధవరపు సూర్యకుమారి, హైదరాబాద్, తెలంగాణా

"శ్రీ పరాభవ" నామ సంవత్సర ఉగాది సందర్భంగా
వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా వారు నిర్వహించిన
31 వ ఉగాది ఉత్తమ రచనల పోటీ లో
'నా మొట్టమొదటి కథ' విభాగంలో ప్రశంసా పత్రం పొందిన కథ

**పెళ్లి చూపులకని శ్రీధర్ బయలుదేరుతున్నప్పుడే** చెప్పాడు అమ్మతో "" నేను ఆ అమ్మాయి తో పర్సనల్ గా మాట్లాడాలి "" అని "సరేలే "అంటూ రెండు పెళ్లిచూపులకి వెళ్ళటం జరిగింది అమ్మాయి తో విడిగా మాట్లాడటం ఈ రోజుల్లో మాములు విషయమేకదా అనుకుని ఒప్పుకుంది ఆవిడ .

---

ఓ రెండుసంబంధాలు చూసారు కానీ ఆడపిల్ల వాళ్ళు మళ్ళీ ఏ సంగతీ కనుక్కోడానికి సుముఖత చూపించలేదు . మధ్యవర్తి ని కదిపితే కాస్త ఇబ్బందిగా "మీ అబ్బాయి పెళ్ళి అయితే చేసుకుంటాను కానీ పిల్లలు మాత్రం వద్దు అన్నాడట అమ్మాయితో..దాంతో వాళ్ళకి మీ అబ్బాయిలో ఏదయినా లోపం ఉన్నదేమో అని అనుమానం వచ్చింది "అని చెప్పాడు.

"నీకు ఇదేం పోయేకాలం వచ్చిందిరా ? పిచ్చిపిచ్చి వేషాలు వేశా వంటే మర్యాద దక్కదు "అని వాళ్ళ నాన్న వార్నింగ్ ఇవ్వటం జరిగి పోయింది . ఐనా మన వాడు దున్నపోతుమీది వర్షం లా దులిపేసుకుని " ఈ విషయం గురించి చర్చ అనవసరం నాన్నా . ఈ కండిషన్ కి ఒప్పుకుంటేనే పెళ్లి "అని తన నిర్ణయం చెప్పాడు.

తిక్కవెధవ వీడికి పెళ్లి అవుతుందో లేదో అని తెగ బెంగ పెట్టేసుకుంది శ్రీధర్ అమ్మ. ప్రయత్న లోపం ఉండకూడదని పట్టు విడవని విక్రమార్కుడిలా ప్రయత్నాలు చెయ్యగా చెయ్యగా ఇదిగో వనిత అనే అమ్మాయి సంబంధం వచ్చింది. . ""ఈ సంబంధం అయినా కుదిరేట్టుగా చూడు స్వామీ "అని తిరుపతి వెంకన్నకు మొక్కేసుకుంది కూడాను .

వాళ్ళ ఇంటికి వెళ్ళటానికి ముందు శ్రీధర్ తో "అనవరసర ప్రసంగాలు చెయ్యక పిల్ల నచ్చిందని చెప్పు..ఫోటో లో బాగుంది ఉద్యోగం కూడా చేస్తోంది " అని మరొక్క సారి శ్రీధర్ ని హెచ్చరించారు తల్లితండ్రులు ఇద్దరూ . వినీ విననట్టు ఊరుకున్నాడు శ్రీధర్ .

వాళ్ళ ఇంట్లో కాసేపు మాట్లాడుకున్నాక వనితని పిలిచారు.

కళగా ఉన్నది పిల్ల అని అనుకునేటంతలో “”మీతో విడిగా మాట్లాడొచ్చా ? “అని శ్రీధర్ అడగటం ఆ అమ్మాయి సరే అనటం జరిగిపోయాయి..

ఈ సంబంధం కూడా చేయిజారిపోయినట్లే అనుకున్నారు శ్రీధర్ అమ్మ నాన్న .

ప్రక్క గది లోకి వెళ్లి కూర్చునాక “ చెప్పండి “అంది వనిత

“మీరు నాకు నచ్చారు .నా అభిప్రాయాలూ లేక కండిషన్స్ అనుకోండి మీకు అవి తెలియాలి.వాటిని కూడా మీరు ఇష్టపడితేనే పెళ్లి జరుగుతుంది “”.అని ఆగాడు

శ్రద్ధగా వింటూ తల ఊపింది .

“నేను పిల్లలు అస్సలు వద్దు అనుకుంటున్నాను. ఇది సమ్మతమైతే సరే లేకుంటే ఇక్కడితో ఈ సంభాషణ ఆపేద్దాం “అన్నాడు .

“ఇదేనా మీ కండిషన్? లేక ఇంకేమైనా ఉన్నాయా “?అని అతి మామూలు గా అదేదో అతి సాధారణ విషయం అయినట్టు అడిగింది .

“”ఇంకేమి లేవు ప్రతి భర్తా కోరుకున్నట్టు అన్యోనం గా ఉండే భార్యని కోరుకుంటున్నాను “”అన్నాడు

“నాక్కూడా కొన్ని కండిషన్స్ ఉన్నాయి .నేను ఉద్యోగం మానను .నాకు నా కెరీర్ చాలా ముఖ్యం .ఇందుకు సహకరించే భర్త కావాలి. కొన్నాళ్ళు పోయాక మీ మనసు మారి పిల్లలు కావాలని అంటే కుదరదు. నాకు పిల్లలూ ఉద్యోగం రెండూ మేనేజ్ చేసే ఓపికా లేదు ఇంట్రెస్టు లేదు .మీ కండిషన్ గురించి చూచాయగా విన్నాం . మరి మీకు ఒకే నా ? “అంటున్న వనితను మెచ్చుకోకుండా ఉండలేకపోయాడు . ఒక ఆడపిల్ల తన గురించి ఇలా చెప్పిదంటే మంచి ధైర్యస్తురాలు అన్నమాట..

“మరి మీరుపెళ్ళి అయ్యాక మనసు మారి తల్లిని కావాలనే కోరిక కలిగో లేక ఇంట్లో వాళ్ళ ఒత్తిడి భరించలేకపోయో మనసు మార్చుకుని పిల్లలు కావాలని అడగకూడదు .మరి మీకు ఆ మనో ధైర్యం ఉందా ? ”అన్నాడు

“”మీరే చూస్తారుకదా “ అని నవ్వుతూ గ్రీన్ సిగ్నల్ ఇచ్చేసింది పెళ్ళికి .

ఆలస్యం అయితే ఎక్కడ మనసు మార్చుకుంటారో అ న్నట్లు వెంటనే పెళ్ళి జరిపించేశారు పెద్దలు.

పెళ్ళి అయినా ఓ రెండు ఏళ్ళ నించీ మొదలు పెట్టారు అంతా”” ఏమైనా విశేషమా”అంటూ “వీళ్ళు ఏ సమాధానమూ చెప్పే వాళ్ళు కాదు . అలా ఆరు సంవత్సరాలు గడిచిపోయాయి .చుట్టాలూ శ్రేయోభిలాషులూ అంతా శ్రీధర్ దంపతుల మీద తెగ జాలి పడిపోతూ ఏ డాక్టర్ దగ్గరికి వెళ్ళితే మంచిదో,ఏ పూజ చేస్తే మంచిదో ఇంకా చిట్కా వైద్యాలూ అన్నీ చెప్పేవాళ్ళు . మొదట్లో ఓపిగ్గా మొహమ్మాటం కొద్దీ వినే వాళ్ళు. ఈ సలహాలు మరీ ఎక్కువ అవడం తో విసుగొచ్చి “మేము పిల్లలు వద్దు అనుకునే పెళ్లి చేసుకున్నాం . మాకు పిల్లల్ని కనే ఉద్దేశ్యం లేదు “అని నిర్మొహమాటంగా చెప్పేసారు . సలహాలు ఇవ్వటమైతే మానేశారు కానీ అదొక సంచలన వార్త అయిపోయింది .

శ్రీధర్ అమ్మ నాన్న అత్త మామగారు ఇద్దరికీ చెప్పిచూశారు వయసులో ఉన్నప్పుడు తెలియదు పెద్దవాళ్ళైయ్యాక ఒక అండ కావాల్సి వస్తుంది .మీకంటూ కొడుకైనా కూతురైనా ఒక్కరైనా ఉండాలి. అని. నీ పట్టుదల వల్ల వనితకు తల్లి అయ్యే అవకాశం పోతోంది అని సెంటిమెంటు కూడా జోడించారు.

“పెళ్లి చూపుల్లోనే మేమిద్దరం ఈ విషయం గురించి స్పష్టంగా మాట్లాడుకున్నాం . మా ఇద్దరిదీ ఒక్కటే అభిప్రాయం . పిల్లలు వద్దు అని నిర్ణయించుకున్నాము . ఎప్పుడో ముసలితనం లో ఆసరా అవుతారని మేము పిల్లలిని ఎందుకు కనాలి? వాళ్ళని పెంచే ఓపిక తీరుబాటు కోరిక కూడా లేదు మాకు. ఆబాధ్యత బాదర బందీ వద్దు అనుకునే మేమీ నిర్ణయం తీసుకున్నాం “అన్నారు ఇద్దరూ .

“మూర్ఖంగా మాట్లాడకండి . పెద్దవాళ్ళం ఎందుకు చెపుతున్నామో వినండి.మేము మిమ్మల్ని పెంచలేదూ ! అదేమంత బ్రహ్మ విద్యా ? ! పిల్లలు పుడితే అన్నీ అవే అలవాటు అవుతాయి మన వంశం నీతో నే ఆగిపోతుంది “అని ఎంత బ్రతిమిలాడినా చివాట్లు పెట్టినా ఫలితం లేకపోయింది.” మీరు మమ్మల్ని మీకు నచ్చిన విధానంలో పెంచారు.నాకు తెలుసు మీరు మా అవసరాలు కోరికలు తీర్చడానికి ఎన్ని ఇబ్బందులుపడ్డారో. ప్రతిదానికీ ఎంత తర్జన భర్జన చేసేవారో .ఎందుకు ? ఇప్పుడు అవసరమా? ఆలా అని మీ ఇబ్బందులు నాకు తెలియవనుకోకండి ఉన్నదాంట్లో అడిగినవన్నీ శక్తికి మించినవైనా అమర్చారు . అందరూ మీ అంత అదృష్టవంతులు కారు నాన్నా పిల్లల విషయం లో . పెదనాన్న నే చూడండి వాసుకోసం పొలం అంతా అమ్మేసారు వాడి చదువు కోసం .పెద్ద ఉద్యోగం చేసి మలి వయసులో వాడు దగ్గర ఉంటాడని ఎంత ఆశ పడ్డారు?. వాసు ఎం చేసాడో మనకి తెలీదా ? అమెరికాపోయి అక్కడే స్థిర పడిపోయాడు నాలుగేళ్లయి చూడడానికి కూడా రాలేదు. ఇంకా పిల్లల మీద మమకారం ఆశలూ పెంచుకోమంటున్నారు “అనే సరికి .

“అందరూ ఆలానే ఉంటారని ఎందుకనుకుంటావు? చుట్టూ ఉన్న వాళ్ళని చూడు ప్రాజ్ఞులై పెద్దవాళ్ళని ఏంతో ప్రేమగా చూసేవాళ్లూ ఉన్నారు “అని ఎంత చెప్పినా వినలేదు .

“ వాళ్ళ ఖర్మఎలా ఉంటె ఆలా అవుతుంది అని వాళ్లతో కొన్నాళ్ళు మాటలు కూడా మానేశారు. త లుచుకున్నప్పుడల్లా వీడు ఇలా ఎందుకు ఆలోచిస్తున్నాడు ? అని మధన పడి పిదపకాలం పిదప బుద్ధులు అంటూ తిట్టుకుని వాస్తవం తో రాజీ పడి పోయారు.కానీ అడపా దడపా ఎవళ్ళో ఒకళ్ళు మనము చెప్తే ఏమైనా మారక పోతారా అన్నట్టు శ్రీధర్ కో వనితకో నచ్చచెప్పే ప్రయత్నాలు మాత్రం మానలేదు . “అబ్బో వాళ్ళని ఒప్పించటం బ్రహ్మతరం కూడా కాదు” అని ఓటమిని అంగీకరించడం జరుగుతూనే ఉంది

ఈ విషయం లో ఎంత మొండివాడో శ్రీధర్ బయట అంత స్నేహంగా ఉంటాడు . శ్రీధర్ అంటే మా ఆఫీసు లో అందరికీ ఇష్టమే .ఎవరితో నూ అనవసర ప్రసంగాలు చెయ్యడు సరదాగా నవ్వుతూ ఉండే అతనంటే మా బాసుగారికి కూడా ఇష్టమే .స్కూళ్ళు మొదలవుతున్నాయి అన్నా పండగలు వస్తున్నాయన్నా మేమందరం ఖర్చుల గురించి తెగ టెన్షన్ పడుతూ ఉంటె శ్రీధర్ మాత్రం హాలిడే ట్రిప్పులు ప్లాను చేసుకునేవాడు అతన్ని

“ నీ కేంటయ్యా చీకూ చింత లేని జీవితం మాకుమల్లే పిల్లలూ కుటుంబ బాధ్యతలు లేవునీ పనే బాగుంది” అని అనేవాళ్లూ కొంతమంది అయితే ,” అతనికేమిటండీ భార్యా భర్తా ఇద్దరూ ఆర్జిస్తున్నారు.పైగా పిల్లలూ లేరు. అదృష్టవంతుడు” అని అసూయ పడే వాళ్లు కొందరు . అందరికీ ఒకటే సమాధానం “”ఇదేగా మీరు కోరుకున్న జీవితం !ఎందుకు హైరాన పడతారు?” అంటూ నవ్వుతూ జవాబు ఇచ్చి నోరు మెదప కుండా చేసేవాడు ఆలా అని అవతలి వాళ్ళ సమస్యలేమీ పట్టించుకోకుండాకూడా ఉండే తత్త్వం కాదు అతనిది .

ఆమధ్య మా ఆఫీసు టైం లో నాదగ్గరకి రాఘవయ్యగారు వచ్చి ”నీతో కొంచెం పని ఉందయ్యా .అమ్మాయి పురిటికి వచ్చింది ఇవాళో రేపో డెలివరీ అవ్వచ్చు హాస్పిటల్ ఖర్చులు ఆ తరువాత బారసాల ఖర్చులు అన్నీ కనీసం ఒక లక్ష దాకా అవుతుందేమో మరి. లోను తీసుకుందాము అని దరఖాస్తు పెట్టాను. శాంక్షన్ అయింది గాని వచ్చే నెలలో రిలీజ్ ఆవుతుందన్నారు అక్కౌంట్ డిపార్టుమెంటు వాళ్ళు తెలిసిన వాళ్ళందరినీ అడిగానయ్యా ఎవ్వరూ ఇప్పుడు ఇవ్వలే మంటున్నారు. ఏంచేయాలో తోచటం లేదు .నువ్వు ఏమైనా సర్దగలవా ?”అనిఅడిగారు నన్ను . “ సారీ అండి నాదగ్గర కూడా ఇప్పుడు లేవు “.అనగా నే దిగులుగా కూర్చుండి పోయారు .

అప్పుడే అటునుంచి వెళుతూ మమ్మల్ని చూసి “ఏమిటిసంగతి ?తీరికగా టైమ్ పాసు చేస్తున్నారా?” అంటూ శ్రీధర్ ఆగాడు .

రాఘవయ్యగారు శ్రీధర్ ని ”ఏ బాదరబందీ లేని సంసారం నీది పైగా మీ ఆవిడా కూడా ఉద్యోగస్తురాలుకదా. నీకు మాకష్టాలేం అర్ధమవుతాయి? టూర్ల మీద తిరగటం ఒక్కటే తప్ప ””అని ఓసారి మాట జారారు .

.”’ఎందుకు తెలియ వండీ ? నేను అలాంటి కుటుంబంలోంచే వచ్చా””అని సౌమ్యంగానే జవాబు ఇచ్చాడు .

దిగాలుగా ఉన్న రాఘవయ్యగారిని చూసి " ఎనీ ప్రాబ్లమ్ ?సమస్య ఏమిటో మీకు అభ్యంతరం లేకపోతే చెప్పండి .ఏదైనా పరిష్కారం దొరుకుతుందేమో చూద్దాం "అని అనునయంగా అడిగాడు .రాఘవయ్య సంశయిస్తూంటే

నేను కల్పించుకుని "వీళ్ళ అమ్మాయి పూరిటి కి వచ్చింది .లోను శాంక్షన్ అయింది కానీ టైం పట్టేట్లుంది .అర్జెంటుగా ఖర్చులకి ఈయనకి అప్పుకావాలి ఎక్కడా దొరకడంలేదు .అదే ఎలాగా అని బుర్రబద్దలు అయ్యేలా ఆలోచిస్తున్నాము.'అని చొరవతీసుకుని చెప్పాను .

"ఎంత కావాలి ?" అని అడిగాడు

మొహమాటంగా" లక్ష అవసరం ."అన్నారు రాఘవయ్య.

కాసేపు ఏమీ మాట్లాడలేదు. "ఎప్పటిలోగా కావాలి ?"అని అడిగాడు.

"ఈ వారం లోపు కావాలి " అని జవాబు ఇచ్చారు.

"నేను సర్దగలను కానీ నాకు వచ్చే నెలలో తిరిగి ఇవ్వ గలరా? "అన్న శ్రీధర్ ని తెల్లబోయి చూస్తూ "హాస్యానికి కూడా ఒక సమయం ఉంటుంది '"అంటున్న ఆయనని "సర్ నేను సరదాకి అనటం లేదు. నేను మీకు లక్ష రూపాయలు సర్దగలను .వచ్చేనెల అండమాన్ ట్రిప్పు ప్లాన్ చేసుకున్నాము . అందుకు నాకు వచ్చేనెలలో వాపసు కావాలి .ఆలా అయితే ఇవ్వగలను."" అంటున్న

శ్రీధర్ చేతులు పట్టుకుని "మరోలా అనుకోకు శ్రీధర్ టెంషన్ లో ఆలా అనేశాను స మయానికి అడగకుండానే సహాయంచేస్తున్నావు.థాంక్స్ తప్పకుండావచ్చే నెలలో తిరిగి నీకు వాపసు చేస్తాను.నాకు లోను శాంక్షన్ అయింది వచ్చేనెలలో రిలీజ్ అవుతుంది.ఇదుగో ఆర్డర్""అని ఆర్డర్ చూపించారు .

"సరే నండీ రేపు చెక్కు ఇస్తాను సర్ "అని వెళ్ళిపోయాడు .

"సమయానికి దేవుడులా ఆదుకున్నాడు . కొండంత భారం తీరినట్లు ఉందోయి "అంటూ తన టేబుల్ దగ్గరకి నడిచారు తేలికపడ్డ మనసు తో రాఘవయ్యగారు .

శ్రీధర్ బాసుగారికి పుట్టినరోజు జరుపుకోవాలని అనిపించి తన ఆఫీసు వాళ్ళందరినీ కుటుంబాలతో సహా పార్టీకి పిలిచాడు.ఎంతో సరదాగా ఖబుర్లు చెప్పుతూ అందరినీ పేరుపేరునా పలకరిస్తూ .శ్రీధర్ దంపతుల దగ్గరికి వచ్చాడు .పలకరింపులైనాక "శ్రీధర్ నీ బాస్ లా కాకుండా నీ శ్రేయోభిలాషిగా ఒక సలహా ఇవ్వాలని ఉంది "అని ఆగాడు శ్రీధర్ వంక చూస్తూ .

ఏ విషయం గురించో చూచాయగా గ్రహించుకున్నా బాస్ అనే గౌరవం తో "చెప్పండి సర్ "అన్నాడు.

" మీకు ఇంకా పిల్లలు లేరు అని విన్నాను .ఒక్కో అప్పుడు ఆలశ్యం అవుతుంది అనుకో కానీ మన ప్రయత్నం కూడా కావాలికదా. నాకు తెలిసిన స్పెషలిస్ట్ ఉన్నారు కలుసుకోండి "అని చెప్పాడు .

శ్రీధర్ చాల మాములుగా "థాంక్స్ సర్ .మేము పిల్లలు వొద్దు అనుకున్నాము .అందుకు మీరు చెప్పిన స్పెషలిస్ట్ ని కలుసుకోము "అన్నాడు నిర్మొహమాటంగా .

""ఎందుకు వద్దు అనుకున్నారు?" అని ఆయనఏదో ఎంక్వయిరీ లోలా ప్రశ్నసంధించాడు. శ్రీధర్ ఏంజవాబు చెప్తాడో అని అందరూకుతూహలంతో నిశబ్దం అయ్యారు.

చిన్నగా గొంతు సవరించుకుని "నేను చెప్పేది మీలో చాలా మందికి నచ్చక పోవచ్చు .ఇది నా అభిప్రాయం ఆలోచన మాత్రమే.మీరంతా నాతో ఏకీభవించాలని అనుకోటం లేదు.మన సమాజంలో ఇంకా ఎదుటి వాడి అభిప్రాయాన్ని గౌరవించే సంప్రదాయం ఉంది.. సాధారణంగా ఈ రోజుల్లో ఒకళ్ళో ఇద్దరో పిల్లల్ని కంటున్నారు దంపతులు . వాళ్ళు పుట్టిన దగ్గరనించి పిల్లల భవిష్యత్తు కోసమే ఆలోచిస్తూ సంతోషంగా చాలానే త్యాగాలు చేస్తారు.ఇది మా బాధ్యత అని మనసుకు నచ్చ చెప్పుకుంటారు. ప్రతి విషయం లోను ముందు

పిల్లల అవసరాలు తీర్చి ఆ తరువాతే తమగురుంచి ఆలోచించుకుంటారు.ఉన్న ఆస్తులు అమ్మి పిల్లల కోసం ఖర్చుచేసేసిన వాళ్ళు కొందరైతే, పొట్టకట్టుని పైసా పైసా కూడపెట్టి పిల్లలకి ఆస్తులు ఇచ్చినవాళ్లు కొందరు .

ప్లేస్కూలు నించి డీగ్రీ దాక చదువుకున్నన్ని రోజులూకాకుండా ఉద్యోగంలో స్థిరపడే వరకూ మనదేశం లో అమ్మనాన్నల దే పూచీ .ఒక్కక్క పిల్ల మీద కనీసం అరవై నించి ఎనభై లక్షలదాకా ఖర్చు చేస్తారు ఎందుకు ? వాళ్ళు స్థిరపడితే మన వృద్ధాప్యంలో మనకి అండగా ఉంటా రన్న ఆశతో . అంటే మనం పెట్టిన మదు పుకి రిటర్న్ కోరుకుంటున్నాం అన్నమాట.ఒక్కోసారి మన అంచనాలు తారుమారై మన బాధ్యత పిల్లలు తీసుకోరు.కారణాలు ఏమైనా అది మనకి తీరని నష్టం డబ్బుపరంగానూ మానసికంగానూ .కాదంటారా ? నేను అందరి పిల్లలూ ఇలా ఉంటారని అనటం లేదు. విదేశాల్లో స్థిరపడి తల్లితండ్రుల్ని అక్కడికి తీసుకు వెళ్లలేక ఓల్డేజ్ హోమ్స్ లో ఉంచుతున్నారు ఇప్పటి రోజుల్లో .ఇదిసామాన్య విషయంగానే చూస్తున్నాం కదా .! ప్రతీ మనిషిలోను కొంచెం స్వార్ధం ఉంటుంది. మనపిల్లలకి కూడాముందు వాళ్ళ కుటుంబం అవసరాల తరువాతే తక్కిన వారి గురించి ఆలోచిస్తారు. తల్లితండ్రులూ ఆతరవాతే .ఒప్పుకుంటారు కదా ?పిల్లల దయా దాక్షిణ్యాల మీద లేక వాళ్ళ సహృదయం మీద కానీ ఆధారపడ దలుచుకో లేదు మేము. ఇవన్నీ అలోచించి మేము పిల్లలు వద్దు అనుకున్నాము పిల్లలు ఉంటె వాళ్ళ మీద పెట్టె ఖర్చు నేను సేవు చేస్తున్నాను మా భవిష్యత్తు కోసం "అన్నాడు .

"ఇదెక్కడి వితండ వాద నయ్యా?పిల్లలు మన ప్రతిరూపాలయ్యా .వీళ్ళని తీర్చి దిద్ది దేశానికీ భావి పౌరులనియ్యాల్సిన బాధ్యత మనందరిమీదా ఉంది .మరీ ఇంత స్వార్ధపరుల్లా ఆలోచించకూడదు . అందరూ ఇలా అనుకుంటే భావితరాలేమిటి కావాలి? మన దేశంలో కూడా కొన్నాళ్ళకి జపాన్ లాగా వృద్ధులు ఎక్కువై యువత ఉండదు అందరూ నీలా ఆలోచిస్తే . నా ఉద్దేశ్యం లో మీరిద్దరూ జీవితంలోని మధురమైన అనుభూతులు మిస్ అవుతున్నారు అనిపిస్తోంది " అంటూ ఒకింత బాధ ,ఆశ్చర్యమూ కొంత అసహనం వ్యక్తం చేసాడు.

కొందరు మాత్రం నిజమే ఈ మధ్య పిల్లలే వద్దనుకే జంటలు ఎక్కువైనాయని వార్తల్లో చదివాము అన్నారు.

".పిల్లలు మనల్ని వృద్ధాప్యం లో చూసుకుంటారు అనే ఆలోచన కూడా స్వార్ధం కాదా సర్ ?నేనుస్వార్ధపరుడు అని ఒప్పుకుంటాను. చిన్నప్పటి నుంచి చూస్తున్నాను.తాహతుకు మించినవి అయినా పుత్ర ప్రేమతో వాళ్ళకి అమర్చి వాళ్ళ ముఖంలో కనపడే తాత్కాలిక ఆనందాన్నిచూసి సంతృప్తి పడే తల్లితండ్రులు ఉన్న దేశం మనది.అదే పిల్లల వల్ల అవమానాలపాలై ఉన్నదంతా ఉడ్చిపెట్టి ఎం బావుకున్నాం అని మధనపడ్డవాళ్ళని కూడా చూడటం లేదా? అంతెందుకు ? గుండెలమీద చెయ్యి వేసుకుని మీరే చెప్పండి? ఒక్కసారైనా మీకు ఇంత ఖర్చు పిల్లలమీద పెడుతున్నామా అన్న ఆలోచనే రాలేదా?"" అంటూ సవాల్ చేసాడు శ్రీధర్.

సమాధానం తెలిసినా చెప్పలేక మౌనంగా ఉండిపోయారు అంతా .

ఇక ఇతనితో మాట్లాడి ప్రయోజనం లేదని పించింది కాబోలు ""నీ జీవితం నీ ఇష్టం నువ్వు పెట్టుకున్న రంగుటద్దాలు నీకు కుటుంబ వ్యవస్థని ఇలా చూపిస్తోంది "అంటూ మర్యాదగా అక్కడినించి కదిలాడు మా బాస్ .

ఏమైతేనేమి శ్రీధర్ మాటలు విన్నాక ఇలాకూడా ఆలోచించే వాళ్ళు కూడా ఉంటారా అని విస్తుపోయిన వాళ్ళు కొందరైతే మనకెందుకు ఇలాటి ఆలోచన రాలేదని వాపోయిన వాళ్ళు కొందరు అయ్యారు. .చాలారోజులు నలుగురు కలిస్తే ఈ విషయం మీదే చర్చ జరిగేది .

కాలక్రమేణా అందరూ శ్రీధరకి పిల్లలు లేరు అని కాని లేక ఆదొక చర్చనీయాంశ మైన విషయం అని అనుకోకపోవటంతో మరెప్పుడూ శ్రీధర్ దగ్గరకానీ ఆఫీసులో కానీ ఆ ప్రస్తావన తీసుకురాలేదు. అదేమీ పట్టని శ్రీధర్ ప్రస్తుతానికి హాయిగా తనదైన పద్ధతి లో తను పెట్టుకున్న రంగుటద్దాల్లోంచి జీవితాన్ని చూసుకుంటూ హాయిగా ఉన్నాడు .

★★★★